సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

కదిలిన దండు

జనసంద్రం కదిలింది..
అభిమానం ఉప్పొంగింది..
సాగరతీరం సాక్షిగా
ఉత్సాహం ఉరకలేసింది
యువసైన్యం కదిలివచ్చింది
జయహో వాసుపల్లి అంటూ నినదించింది
దక్షిణం మురిసింది


మహిళా ఉత్సాహం..


కనకమహాలక్ష్మి అమ్మవారి చెంత నామినేషన్ పత్రాలతో పూజలు జరుపుతున్న వాసుపల్లి గణేష్ కుమార్

- అట్టహాసంగా వాసుపల్లి నామినేషన్
- కదలి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- కిటకిటలాడిన రహదారులు
- అడుగడుగునా నీరాజనాలు పలికిన ప్రజలు
- ర్యాలీలో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ


ప్రజలకు అభివాదం చేస్తున్న వాసుపల్లి గణేష్, చిత్రంలో మేయర్ హరివెంకట కుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు


భారీ ఊరేగింపుగా నామినేషన్ వేసేందుకు వస్తున్న దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్

అల్లిపురం : వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ నామినేషన్ పర్వం అట్టహాసంగా సాగింది. పార్టీ ముఖ్య నేతలు తరలిరాగా..కార్యకర్తలు, అభిమానులు భారీగా ర్యాలీలో పాల్గొన్నారు. శనివారం మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయంలో వాసుపల్లి నామినేషన్ దాఖలు చేశారు. ముందుగా జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరమెట్ట బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి ఆశీలమెట్ట దరి సంపత్ వినాయగర్ ఆలయంలో పూజలు జరిపి అక్కడనుంచి బురుజుపేటలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి పాదాల చెంత నామినేషన్ పత్రాలు ఉంచి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఒంటెలు, తప్పెటగుళ్లు, కేరళ వాయిద్యాలు, గరగల నృత్యాలు, మహిళల డ్యాన్సుల మధ్య మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, వాసుపల్లి కుమారుడు సూర్య దంపతులు, వాసుపల్లి సాకేత్, కార్పొరేటర్లు చెన్నా జానకిరామ్, కోడిగుడ్ల పూర్ణిమ, తోట పద్మావతి, మేరీ జోన్స్, కోడూరు అప్పలరత్నం, ఏపీ మెకనైజ్డ్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్, నియోజకవర్గం ప్రజలు వెంట రాగా ర్యాలీగా కనకమహాలక్ష్మీ దేవాలయం వద్ద నుంచి గోషాస్పత్రి, పంజా జంక్షన్, టౌన్ కొత్తరోడ్డు జంక్షన్ మీదుగా రాజారామ్‌మోహన్‌రాయ్ రోడ్డుకు చేరుకున్నారు. వెలంపేట, పెరికివీధి మీదుగా పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ అమ్మవారి దేవాలయానికి చేరుకుని అమ్మవారికి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలసి పూజలు నిర్వహించారు. తరువాత అక్కడ నుంచి కల్లుపాకలు, పోలీస్ బ్యారెక్స్ మీదుగా టర్నల్ చౌల్ట్రీ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి వాసుపల్లి గణేష్‌కుమార్, తన సతీమణి ఉష, లాయర్, నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీ వాత్సవ్‌లతో కలిసి రిటర్నింగ్ అధికారి ఆర్‌వో సీతారామయ్యకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురుతుందన్నారు. మరో 20 ఏళ్లు జగనన్నే ముఖ్యమంత్రిగా కొనసాగుతారన్నారు. మత్స్యకారులు తోలు తీస్తానని చంద్రబాబు నాయుడు అంటే మత్స్యకారులకు మేలు చేస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారన్నారు. నియోజకవర్గ ప్రజలు తన వెంటే ఉన్నారన్నారు. వారి సహకారంతో మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తానన్నారు.

నామినేషన్‌కు తరలివెళ్లిన కార్యకర్తలు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం నామినేషన్ వేశారు. ఈ మేరకు వార్డుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జై జగన్..జై..వాసుపల్లి అంటూ నినాదాలు చేస్తూ, బైక్ ర్యాలీలు, పాదయాత్రల ద్వారా 14 వార్డుల నుంచి కార్యకర్తలు తరలివెళ్లారు. కనకమహాలక్ష్మీ దేవస్థానం నుంచి ర్యాలీలో పాల్గొని టర్నల్ చౌల్ట్రీ వరకు ర్యాలీలో పాల్గొన్నారు.


దప్పులతో సందడి


ప్రత్యేక ఆకర్షణగా..


కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో..


నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ..


ర్యాలీలో పాల్గొన్న మహిళలు


జేసీజే ఇన్‌చార్జ్ కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్ ఆధ్వర్యంలో తరలివెళ్లిన 33వ వార్డు కార్యకర్తలు


పీతల వాసు ఆధ్వర్యంలో ఉత్సాహంగా..


గరగల నృత్యం చేస్తున్న కళాకారులు

క్లుప్తంగా

పండగలా నామినేషన్

- పార్టీ శ్రేణులకు, ప్రజలకు వాసుపల్లి కృతజ్ఞతలు


కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్

అల్లిపురం: తన నామినేషన్ ప్రక్రియను పండగలా చేసిన దక్షిణ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులకు, ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆశీలమెట్ట పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీతో కలిసి పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా భారీ ఎత్తున ముస్లిం సోదరులు, క్రిస్టియన్స్, హిందువులు తన గెలుపునకు ఆశీర్వచనాలు అందిస్తూ నామినేషన్ ప్రక్రియలో పాల్గొనడం మరింత బలాన్ని ఇచ్చిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అత్యధిక సీట్లతో మళ్లీ ముఖ్యమంత్రి కాబోతున్నారన్నారు. తనకు ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు. పార్టీ వార్డు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

అల్లిపురం: జీవీఎంసీ 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావుపై మహారాణిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఆస్తులపై జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచార పోస్టర్‌ను అతికించినందుకు గాను దినపత్రికల్లో వచ్చిన వార్త ఆధారంగా కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

కార్మికుల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదు


మాట్లాడుతున్న కనకారావు

అల్లిపురం: పారిశ్రామిక సంస్థల్లో కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విధిగా భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని, చాలా సంస్థల్లో ఈ ప్రమాణాలు లేక పోవడంతో అధిక సంఖ్యలో కార్మికులు గాయాలు పాలవుతున్నారని కాన్ఫడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు అన్నారు. ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ఓ హోటల్‌లో సీఐటీయు ఆధ్వర్యంలో కార్మికుల సంక్షేమం, వారి భద్రత, ఆరోగ్య సమస్యల నివారణ చర్యలు అనే అంశంపై జరిగిన ప్రత్యేకంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎల్‌వీపీలో కొత్త అవుట్ పేషెంట్ విభాగం


అవుట్ పేషెంట్ విభాగం ప్రారంభిస్తున్న లారస్ ల్యాబ్ లిమిటెడ్ సీఈవో సత్యనారాయణ చావా

ఆరిలోవ: హనుమంతవాక జంక్షన్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో కొత్తగా అవుట్ పేషెంట్ విభాగం అందుబాటులోకి వచ్చింది. ఈ విభాగాన్ని శనివారం లారస్ ల్యాబ్ లిమిటెడ్ సీఈవో సత్యనారాయణ చావా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విభాగానికి తమ ల్యాబ్ నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ విభాగంలో 12 పరీక్షా గదులు, 100 మంది విశ్రాంతి తీసుకొనేలా హాల్ ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవా తెలిపారు. ఈ కార్యక్రమంలో లారస్ ల్యాబ్ హెచ్‌ఆర్ నర్సింహారావు చావా, ఈడీ రవి కుమార్, ఎల్వీపీ వైద్యుడు డాక్టర్ అవినాష్ పతంగి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలే జగనన్న బలం


పూర్ణామార్కెట్ జంక్షన్‌లో బొత్స ఝాన్సీ లక్ష్మి, వాసుపల్లిని గజమాలతో సత్కరిస్తున్న వార్డు ఇన్‌చార్జ్ అలపన కనకరెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ
- మీలో ఒకడిగా సేవ చేస్తా : వాసుపల్లి

జగదాంబ: ప్రజలే జగనన్న బలం..బలగం..ధర్మ పోరాటంగా జరుగుతున్న ఈ కురుక్షేత్ర యుద్ధంలో కృష్ణుడులాంటి ఓటర్లంతా ఓట్లు వేసి అర్జునుడు లాంటి జగనన్నను గెలిపించుకోవాలని విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి నామినేషన్ నేపథ్యంలో ర్యాలీగా పూర్ణామార్కెట్‌కు చేరుకున్నారు. అక్కడనుంచి బొత్స ఝాన్సీ వాసుపల్లి ర్యాలీలో భాగస్వాములయ్యారు. దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి బొత్స ఝాన్సీ, వాసుపల్లి గణేష్‌కుమార్‌లకు గజమాలతో సత్కరించారు. అనంతరం బొత్స ఝాన్సీ మాట్లాడుతూ నామినేషన్ పర్వానికి తరలి వచ్చిన అశేష జనవాహినికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ పరిపాలన రాజధాని కావాలంటే జగనన్న రావాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలిన ఆమె కోరారు. ఎంపీ అభ్యర్థిగా తనను, దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థిగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బొత్స ఝాన్సీ విజ్ఞప్తి చేశారు.

దక్షిణంలో గెలిచి జగనన్నకు బహుమతిగా ఇద్దాం

'నియోజకవర్గ ప్రజలంటే తనకు ఎంతో అభిమానం..వారి కోసం, వారి అభ్యున్నతి కోసం ఎంతైనా కష్టపడతా..మీలో ఒకడిగా సేవ చేస్తా.. ఒక మత్స్యకారుడునైనా తనకు జగనన్న టికెట్ ఇచ్చారు..గెలిచి ఆయనకు బహుమతిగా ఇచ్చేందుకు మీరంతా ఆశీర్వదించాలి' అని వాసుపల్లి గణేష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో అన్ని సామాజికవర్గాలకు చేతులెత్తి విజ్ఞప్తి చేస్తున్నా..మరోసారి అవకాశం కల్పించండి..జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

అభ్యర్థుల వ్యయ లెక్కింపులపై సమీక్ష


మాట్లాడుతున్న పార్లమెంట్ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రెంగరాజన్

అల్లిపురం: రానున్న సార్వత్రిక ఎన్నికలలో విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకులు రెంగరాజన్ నియోజకవర్గ పరిశీలకులతో శనివారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో అభ్యర్థుల వ్యయం లెక్కింపుపై వారితో సమీక్షించారు. ఈ సమావేశంలో దక్షిణం భీమిలీ శాసనసభ వ్యయ పరిశీలకులు సౌమ్య పాండే జైన్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు


గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

అల్లిపురం: బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శనివారం సాయంత్రం చిన్నారులతో భక్తి సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజం సభ్యులు పాల్గొన్నారు. చిన్నారులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి.

సిద్ధం రోడ్ షో విజయవంతం చేయండి

- పార్టీ శ్రేణులకు వాసుపల్లి పిలుపు

అల్లిపురం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆశీలమెట్ట పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన వార్డు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం దక్షిణ నియోజకవర్గం పరిధిలో రైల్వే న్యూకాలనీ జంక్షన్ నుంచి దొండపర్తి మీదుగా అక్కయ్యపాలెం వరకు జగనన్న బస్సు యాత్ర ప్రవేశించనుందన్నారు. ఈ రోడ్ షోలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడిగుడ్ల పూర్ణిమ, కోడూరు అప్పలరత్నం, వార్డు నాయకులు, ఆలయ చైర్మన్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

వాసుపల్లికి క్రైస్తవ సంఘాల మద్దతు


34వ వార్డు వాడబలిజ సంఘం యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి


వాసుపల్లికి మద్దతు తెలుపుతున్న క్రైస్తవులు

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థికి వివిధ సంఘాల మద్దతు తెలియజేస్తున్నాయి. 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ సారథ్యంలో టూరిజం శాఖ డైరెక్టర్ రెయ్యి రేవతి డేవిడ్ రాజు ఆధ్వర్యంలో క్రీస్తు వెలుగు సంఘం పాస్టర్ పి.జాషువాతో పాటు 70 మంది క్రైస్తవులు పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో కొబ్బరితోటకు చెందిన విఘ్నేశ్వర వాడబలిజ సంఘం నుంచి సుమారు 70 మంది యువకులు పార్టీలో చేరారు. వారిని వాసుపల్లి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తనతో పాటు ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆత్మరక్షణలో మహిళలకు ఉచిత శిక్షణ

సీతంపేట: పీవీజీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత సెల్ఫ్ డిఫెన్స్ క్లాసులు నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ డైరెక్టర్ వెంకట్ పోలిశెట్టి తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 5 ఏళ్ల చిన్నారుల నుంచి 30 ఏళ్ల లోపు వయసు గల మహిళలకు ఉచిత శిక్షణకు హాజరు కావచ్చని చెప్పారు. వైఎంసీఏ ఎదురుగా ఉన్న బీచ్ వద్ద, గోపాలపట్నం ఉన్నత పాఠశాల, భీమిలి బీచ్ వద్ద వచ్చే నెల 10 నుంచి వారంలో ఒక రోజు తరగతులు జరుగుతాయన్నారు. పి.ఎస్.ఆర్ అకాడమీ ఏపీ రాష్ట్ర ఇన్‌చార్జి పి.నరసింహరావు మాట్లాడుతూ 1980 నుంచి మార్షల్ ఆర్ట్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. తద్వారా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. మార్షల్ ఆర్ట్స్ ప్రధాన శిక్షకుడు శివరామకృష్ణ మాట్లాడుతూ ఆరు నెలలు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందితే ఆత్మవిశ్వాసం, చైతన్యం, ధైర్యం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో చైతన్య, ఏలియన్స్ కళాశాల డైరెక్టర్ సతీష్ కొల్ల, ఏపీ హెడ్ మిల్టాన్ శాస్త్రి, వి.పూజారి, విశాఖ అధ్యక్షుడు కె.కె.రాజు, కార్యదర్శి ప్రవీణ్, జి.శివరామకృష్ణ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వెంకట్ పోలిశెట్టి

ఘనంగా ఏఐబీఈఏ వ్యవస్థాపక దినోత్సవం

అల్లిపురం: అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) 79వ వ్యవస్థాపక దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎల్ఐసీ ప్రధాన బిల్డింగ్‌లో గల పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఎల్ఐసీ బ్రాంచ్ వద్ద ఏఐబీఈఏ కార్యదర్శి ఆర్.వసంతరావు పతాకావిష్కరణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణలో ఏఐబీఈఏ ప్రముఖ పాత్ర వహించిందన్నారు. భారతదేశంలో బ్యాంకు ఉద్యోగులకు అత్యంత బలమైన యూనియన్ అని అన్నారు. ఈ సందర్భంగా ఆశ్రయ మహిళా వసతి గృహం మహిళలకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం నాయకులు వి.రమేష్, ఆదారి శ్రీను, ఈశ్వర్, వైశాలి, సుజాత, పీఎస్ఆర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.


పతాకావిష్కరణలో పాల్గొన్న ఏఐబీఈఏ కార్యదర్శి వసంతరావు

పోలమాంబకు కుంకుమార్చనలు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు సంజయ్‌గాంధీ కాలనీలో గ్రామదేవత పోలమాంబ అమ్మవారి పంచరాత్రి జాతర మహోత్సవాలు రెండు రోజులుగా జరుగుతునానయి. ఈ ఉత్సవాలు మంగళవారం వరకు కొనసాగనున్నాయి.


సంజయ్‌గాంధీ కాలనీ పోలమాంబ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఇందులో భాగంగా శనివారం ఆలయ నిర్వాహకులు అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. సంజయ్‌గాంధీ కాలనీ, సింహగిరి కాలనీ, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక ప్రాంతాల నుంచి సుమారు 200 మంది మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు చేశారు. అనంతరం కుంకుమ పూజలు చేసిన మహిళలకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ స్వాతి, తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో కార్లు నిలిపేచోట శనివారం ఉదయం 9 గంటల సమయంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వ్యక్తికి సుమారు 40 ఏళ్ల వయస్సు ఉండొచ్చు. నీలం రంగు జీన్‌ప్యాంట్ వేసుకున్నాడు. ఎండ తీవ్రతకు తట్టుకోలేక.. లేదా సరైన ఆహారం లేక మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. కంచరపాలెం సిద్ధార్థనగర్ వీఆర్వో ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. వ్యక్తి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. మృతుడి సమాచారం తెలిసిన వారు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com